సాక్షి చిత్తూరు

శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



బోయకొండ.. పుష్పశోభితం
నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బోయకొండ క్షేత్రం పుష్పశోభితమై, భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. - 8లో



పర్యాటక రంగం కీలకం
మన ఆర్థిక వ్యవస్థ వృద్ధికి పర్యాటక రంగం ఎంతో కీలకమని జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి మల్లికార్జున తెలిపారు. - 8లో



విద్యుత్ బస్సులు.. కూటమి బ్రేకులు
విద్యుత్ బస్సుల నిర్వహణపై దృష్టి పెట్టకుండా కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ఆదాయానికి బ్రేకులు వేసింది. - 8లో

న్యూస్‌రీల్

అర్హులందరికీ ఉపాధి పనులు



బాధ్యతలు స్వీకరించిన పీడీ రవికుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అర్హులందరికీ ఉపాధి హామీ పనులు అందేలా కృషి చేస్తానని నూతన డ్వామా పీడీ రవికుమార్ అన్నారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయంలో పీడీగా బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా డీఎల్‌డీఓగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన చిత్తూరు డ్వామా పీడీగా నియమితులయ్యారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం, కలెక్టర్ సూచనలను పాటిస్తూ డ్వామాలో అమలవుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు చేరువ చేస్తానన్నారు. డ్వామా పరిధిలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పనుల పురోగతిలో జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. అనంతరం ఆ శాఖలో పనిచేస్తున్న ఏపీడీలు, సిబ్బంది నూతన పీడీకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కుండపోతగా వర్షం

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో శుక్రవారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. మూడు గంటలకుపైగా వర్షం కురవడంతో రెండు నియోజకవర్గాలు జలమయంగా మారాయి. ప్రధానంగా చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాల్లో మోకాటిలోతు వరకు నీళ్లు నిలిచాయి. అలాగే కాణిపాకం ఆలయలోపలికి నీరు చేరింది.

అప్పలాయగుంటలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ



వేడుకగా సేనాధిపతి ఉత్సవం

పుత్తూరు: అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం పవిత్రోత్సవాల అంకురార్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవాన్ని మేళతాళాల మధ్య మాడవీధుల్లో నిర్వహించారు. వైదిక సంప్రదాయం ప్రకారం జాతాశౌచం, మృతాశౌచం వంటి వేళల్లో ఆలయ ప్రవేశం నిషిద్ధం. అయినా యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక ఇటువంటి దోషాలు జరుగుతుంటాయి. దోషాల నివృత్తితో ఆలయ పవిత్రతను కాపాడేందుకు ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే పవిత్రోత్సవాల్లో ఈ నెల 28న పవిత్ర ప్రతిష్ఠ, 29న పవిత్ర సమర్పణ, పవిత్ర హోమాలు చేపడతామని తెలిపారు. చివరి రోజు 30న మహా పూర్ణాహుతి, పవిత్ర విసర్జన ఉంటుందని వెల్లడించారు. పవిత్రోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఆలయ మహాగోపురం వద్ద వేదమంత్రోచ్చరణ మధ్యన అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పవిత్రోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పర్యవేక్షించారు.

వరసిద్ధుని సేవలో తెలంగాణ మాజీ మంత్రి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శుక్రవారం తెలంగాణ మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచనాలు అందజేసి స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఈవో గురుప్రసాద్, సిబ్బంది వాసు, చిట్టిబాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర సమగ్ర శిక్షా సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయా(కేజీబీవీ)ల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ద్వారా ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. పీజీటీ–3, పార్ట్ టైం టీచర్–2 పోస్టులకు ఏడాది కాల పరిమితికి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 'ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్' వెబ్‌సైట్లో పొందుపరిచిన వివరాలతో ఈ నెల 28వ తేదీ నుంచి అక్టోబర్ 10వ తేదీలోపు రూ.250 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను నేరుగా స్వీకరించరని ఆయన పేర్కొన్నారు.

సనాతన ధర్మాన్ని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కుతోంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అరాచక పర్వానికి తెరదీస్తోంది. కల్తీ లడ్డూ వివాద నేపథ్యంలో తిరుమలేశుని దర్శనానికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తే తమ ఆరోపణలన్నీ కొట్టుకుపోతాయని భయపడిపోయింది. అందుకే ఆయన పర్యటన ఖరారు కాగానే గాబరాపడిపోయింది. డిక్లరేషన్ పేరుతో అడ్డంకులు సృష్టించేందుకు తమ అనుయాయులను పురమాచించింది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలకు నోటీసులిచ్చి, గృహనిర్బంధం చేయించి పైశాచిక ఆనందం పొందింది. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ అధినేత పర్యటన రద్దుకావడంతో ఊపిరి పీల్చుకుంది. దీనిపై చిత్తూరు, తిరుపతి జిల్లా ప్రజానీకం రగిలిపోతోంది. నిరంకుశ పాలన ఎక్కువ కాలం సాగదని శాపనార్థాలు పెడుతోంది.

రేణిగుంట విమానాశ్రయంలో మోహరించిన పోలీసు బలగాలు



నిరంకుశం.. నిర్బంధం!

- వైఎస్ జగన్‌ను అడ్డుకునేందుకు కూటమి నేతల కుట్రలు, కుతంత్రాలు
- తిరుపతికి రాకూడదంటూ ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ నేతలకు నోటీసులు
- అర్ధరాత్రి నివాసాలకు వెళ్లి నోటీసులు అందజేత
- తిరుపతిలో భయానక వాతావరణం సృష్టించిన కూటమి ప్రభుత్వం
- తనిఖీల పేరుతో స్థానికులు, భక్తులను ఇబ్బంది పెడుతున్న వైనం

సాక్షి ప్రతినిధి, తిరుపతి : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటనను సైతం రాజకీయంగా వాడుకునేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు అన్నీ ఇన్నీ కావు. పోలీసులను రంగంలోకి దింపి ఆధ్యాత్మిక నగరంలో ఆంక్షల పేరుతో అరాచకాలకు పాల్పడుతోంది. అధికారాన్ని వినియోగించుకుని అడ్డగోలు ఆంక్షలతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, భక్తులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిందని.. జరగని తప్పిదంపై సీఎం చంద్రబాబు రాద్ధాంతం చేయడం తెలిసిందే. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం, ఆ పార్టీల నేతలు వ్యవహరిస్తున్న నేపథ్యంలో వైఎస్ జగన్ శనివారం శ్రీవారిని దర్శించుకోవాలని నిర్ణయించుకున్నారు. చంద్రబాబు చేసిన పాపానికి పరిహారంగా ప్రక్షాళన పూజలు చేయాలని మరోవైపు వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా వైఎస్ జగన్ శుక్రవారం రాత్రికి తిరుమల చేరుకోవాల్సి ఉంది. శనివారం ఉదయం స్వామి వారిని దర్శించుకుని, అదే రోజు మధ్యాహ్నం తిరుగు పయనమయ్యేలా పర్యటన ఖరారైంది. దీంతో మునుపెన్నడూ లేని విధంగా రేణిగుంట, తిరుపతి, తిరుమలలో ప్రభుత్వ పెద్దలు భారీగా పోలీసులను మోహరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా కఠిన ఆంక్షలు విధించారు. తనిఖీల పేరుతో స్థానికులు, భక్తులను ఇబ్బంది పెడుతున్నారు.

మహా 'కుట్ర'!

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా కూటమి నేతలు మహా కుట్రలకు పథకం రచించారు. కాషాయ వేషధారణలో ఉన్న డూప్లికేట్ స్వామిజీల ద్వారా కాన్వాయ్‌ని అడ్డుకోవడం, ఆపై రాళ్లు రువ్వడం, ఈ పరిణామాలన్నింటినీ సోషల్ మీడియా ద్వారా ట్రోల్ చేయడం లాంటి వాటికి ప్రణాళిక రచించారు. 'ముఖ్య' నేతల ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం తిరుపతి నగరంలోని ఓ హోటల్‌లో కూటమి నేతలంతా సమావేశమై చర్చించారు.

పాప ప్రక్షాళన కోసం..

- నేడు జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ప్రత్యేక పూజలు

తిరుపతి రూరల్: జరగని తప్పు జరిగినట్లు చెప్పడమే కాకుండా, వెనక్కి పంపిన నెయ్యిని శ్రీవారి లడ్డూల తయారీలో వాడినట్లు అసత్య ఆరోపణలతో సీఎం చంద్రబాబు చేసిన మహాపాపం రాష్ట్ర ప్రజలకు తగలకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులు నేడు జిల్లా వ్యాప్తంగా పాప ప్రక్షాళన పూజలు చేయనున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో శనివారం ఉదయం పార్టీ నేతలు, కార్యకర్తలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు దేవుడిని సైతం రోడ్డుపైకి లాగుతున్నారని ఇప్పటికే దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. హిందూత్వ వాదులు సైతం చంద్రబాబు తీరుపై మండిపడుతున్నారు. నాణ్యత పరీక్షల్లో ఫెయిల్ అయిన నెయ్యి ట్యాంకర్లను వాడలేదని, తిప్పి పంపినట్లు టీటీడీ ఈవో ప్రకటన చేసిన తర్వాత కూడా, కల్తీ నెయ్యితో స్వామి వారి లడ్డూలను తయారు చేసి భక్తులకు పంపిపెట్టారని చంద్రబాబు చేసిన అసత్య ఆరోపణలు రాజకీయ లబ్ధి పొందేందుకు మాత్రమే అని సామాన్య భక్తులు సైతం ఛీదరించుకుంటున్నారు. తన ఇంటి దైవం వేంకటేశ్వరస్వామి అని చెప్పుకునే చంద్రబాబు రాజకీయంగా జగన్‌ను దొంగదెబ్బ తియాలనే ఇలా దేవుడి పేరుతో పరాచకాలు ఆడుతున్నారని, ఈ స్వార్థ రాజకీయ క్రీడలో జరిగిన మహాపాపం ఎక్కడ తమకు కూడా తగులుతుందో అని రాష్ట్ర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం ఉదయం గ్రామ గ్రామాన ఆలయాల్లో చంద్రబాబు చేసిన మహాపాపంపై పాప ప్రక్షాళన పూజలు చేయనున్నారు.

ఎయిర్‌పోర్ట్‌కు రానివ్వకుండా అడ్డంకులు



ఎయిర్‌పోర్టు బయట కాన్వాయ్

రేణిగుంట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటన నేపథ్యంలో రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం నుంచే అధిక సంఖ్యలో పోలీసు బలగాలు మోహరించాయి. కార్యకర్తలు, నాయకులెవ్వరూ ఎయిర్‌పోర్ట్‌కు రానివ్వకుండా అడ్డుకున్నారు. పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉందని, తెల్లవారుజాము నుంచే వైఎస్సార్ సీపీ ప్రధాన నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని నిద్రలేపి మరీ నోటీసులు ఇచ్చారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎయిర్‌పోర్ట్ బయట అధికారులు ప్రత్యేక కాన్వాయ్ వాహన శ్రేణిని ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బందికి సూచనలిస్తూ ఏ ఒక్కరినీ ఎయిర్‌పోర్ట్ వద్దకు రాకుండా నిలువరించాలని సూచించారు. దీంతో రేణిగుంట నుంచి ఎయిర్‌పోర్ట్ మార్గంలో అడుగడుగునా పోలీసు బలగాలను ఏర్పాటు చేసి అటు వైపు వెళ్లే వాహనాలను ఆపి తిప్పి పంపారు. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ బయట సుమారు వంద మంది వరకు పోలీసు బలగాలను ఉంచి గతంలో ఎప్పుడూ లేని రీతిలో బందోబస్తును ఏర్పాటు చేశారు. అయితే మాజీ సీఎం పర్యటన రద్దు కావడంతో కాన్వాయ్ వాహన శ్రేణిని తిప్పి పంపారు.

ప్రధాన ఆకర్షణగా స్వాగత బ్యానర్లు

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్ట్ నుంచి రేణిగుంట వరకు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి స్వాగత బ్యానర్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. ఆయనకు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేశారు.

ఏడుకొండల వాడితో రాజకీయమా..?

పలమనేరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరుమలకు వెళ్లనీయకుండా అడ్డుకోవడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేసిందని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ మండిపడ్డారు. స్థానిక పోలీసులు మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్ద నోటీసులు అంటించి తిరుపతికి ఇక్కడి నుంచి మాజీ ప్రజాప్రతినిధులు వెళ్లకుండా పోలీసు పహారాతో గృహ నిర్బంధం చేపట్టారు. దీనిపై వారు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా అనేక పర్యాయాలు స్వామి వారిని దర్శనం చేసుకున్నారని చెప్పారు. వారి తండ్రి మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సైతం స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని దేవదేవునికి పట్టు వస్త్రాలను సమర్పించారని తెలిపారు. కేవలం రాజకీయ లబ్ధికోసం కూటమి ప్రభుత్వం డిక్లరేషన్‌ను తెరపైకి తీసుకొచ్చిందని విమర్శించారు. తద్వారా కోట్లాది మంది హిందువుల మనోభావాలను ఈ ప్రభుత్వం దెబ్బతీసిందన్నారు. స్వామి దర్శనానికి రాకుండా చేయడం, సూపర్ సిక్స్ హామీలను మరిచిపోవడానికి లడ్డూ వివాదంతో జనాన్ని ఏమార్చేందుకు కూటమి చేస్తున్న కుట్రలను జనం గమనిస్తున్నారని తెలిపారు. ఏడు కొండలవానితో పెట్టుకున్న కూటమి సర్కారుకు ఇక పతనం తప్పదన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేతకు స్వాగతం పలికేందుకు వెళుతున్న మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలను అడ్డుకొని నోటీసులిచ్చి గృహనిర్బంధం చేయడం కూటమి పాలనకు పరాకాష్టగా చెప్పుకోవచ్చున్నారు. ఏదేమైనా జనాన్ని ఏ మార్చిన చంద్రబాబు ఆఖరికి శ్రీవారితో కూడా చెలగాటమాడుతున్నారని ఇందుకు తగిన శిక్ష అనుభవిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మండీ సుధా, కోదండరామయ్య, రాగిపాళెంరవి, రాజారెడ్డి, నరేష్, ముజ్జుతోపాటు పలువురు పాల్గొన్నారు.



సమావేశంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, వెంకటేగౌడ

వైఎస్సార్‌సీపీ నేతలకు పోలీసుల నోటీసులు



వేపగుంటలో వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మణమూర్తికి నోటీసు ఇస్తున్న పోలీసులు

నగరి/పుత్తూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుమలకు విచ్చేస్తున్నారన్న వార్త రావడంతో నియోజకవర్గంలో పోలీస్ యాక్ట్ అమలు చేశారు. ఈ క్రమంలోనే నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని పేర్కొంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు పోలీసులు నోటీసులు అందజేశారు. పుత్తూరు మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు హౌస్‌అరెస్ట్ చేశారు. శాంతి భద్రతల దృష్ట్యా సహకరించాలంటూ నోటీసులు ఇచ్చి ఇళ్లలోనే నిర్బంధించడం అంటే ఇది కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలన అని ధ్వజమెత్తారు.

కనువిందుగా.. తెప్పోత్సవం



- పుష్కరిణిలో వరసిద్ధుని విహారం
- తరలివచ్చిన భక్తజనం

కాణిపాకం: ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి శుక్రవారం తెప్పోత్సవంలో కనువిందు చేశారు. తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఈ సేవను ఆలయ అధికారులు అత్యంత అద్భుతంగా నిర్వహించారు.

ప్రత్యేక బ్రహ్మోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం చందనాలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి సిద్ధిబుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవమూర్తులను అన్వేటి మండపంలో ఉంచి ప్రత్యేక అలంకరణ చేశారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య స్వామివారిని వేంచేపుగా పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య స్వామి వారిని సర్వాంగసుందరంగా అలంకరించిన తెప్పపై ఆశీనులు చేశారు. స్వామివారు పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. స్వామి నామస్మరణలతో ఆలయ ఆవరణం మార్మోగింది.

కిక్కిరిసిన ఆలయం

బ్రహ్మోత్సవ ఘట్టం చివరి ప్రక్రియ కావడంతో భక్తులు కాణిపాకానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి దర్శనం తరలివచ్చిన భక్తులతో ఆలయంలోని క్యూలన్నీ నిండిపోయాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ కనువిందు చేసిన పార్వతీ తనయుడిని దర్శించుకుని, తన్మయత్వంలో మునిగిపోయారు.

వరసిద్ధుని లడ్డూ రూ.4.25 లక్షలు

వరసిద్ధి వినాయకస్వామి లడ్డూ రూ.4.25 లక్షలు పలికింది. శుక్రవారం రాత్రి నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పూతలపట్టుకు చెందిన భక్తుడు తేజోమూర్తి రూ.4.25 లక్షలకు ఈ లడ్డూను దక్కించుకున్నారు.

బ్రహ్మోత్సవం.. పరిసమాప్తం

ప్రత్యేక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి పరిసమాప్తమయ్యాయి. ఈ నెల 7న వార్షిక బ్రహ్మోత్సవం ప్రారంభమైంది. చివరి సేవ తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

తెప్పపై విహరిస్తున్న స్వామివారు



సమస్యలు అనేకం.. బడ్జెట్ శూన్యం!

- అజెండాలో అంశాలు 31... చర్చించింది 17 అంశాలే
- జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సమస్యలు చాలా ఉన్నాయి.. బడ్జెట్ మాత్రం శూన్యం అని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అజెండాగా 31 అంశాలను చర్చించాల్సి ఉండగా 17 అంశాల వరకే చర్చించి మమ అనిపించారు. ప్రజల సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించాల్సిన సమావేశంలో ఎక్కువ సమయం డీఈఓ దేవరాజును లక్ష్యంగా చేసుకుని కూటమి ఎమ్మెల్యేలు ప్రసంగించారు. చర్చించిన 17 అంశాలనూ సమగ్రంగా చర్చించకుండా తూతూ మంత్రంగా చర్చించి మధ్యాహ్నం 1.30 గంటలకు సమావేశాన్ని ముగించేశారు. ఇలాంటి సమావేశాల వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని పలు శాఖల అధికారులు, సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఈ సమావేశంలో జెడ్పీచైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, నగర మేయర్ అముద, జెడ్పీ సీఈఓ రవి కుమార్ నాయుడు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు శంకర్ నారాయణ, విజయ్ కుమార్, హౌసింగ్, డ్వామా పీడీలు పద్మనాభం, రవి, డీఈఓ దేవరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి డా.రాజ్యలక్ష్మి, డీఎస్ఓ శంకరన్, సీపీఓ సాంబ శివారెడ్డి, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు మురళీకృష్ణ, మధుసూదన రెడ్డి, డీపీఓ లక్ష్మి, చిత్తూరు కమిషనర్ నరసింహ ప్రసాద్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఎంపీపీలు పాల్గొన్నారు.

అన్ని అంశాలు బడ్జెట్‌కు సంబంధించినవే!

ఏ అంశం అయినా బడ్జెట్‌కు సంబంధించినదేనని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులు చేసేందుకు బడ్జెట్ తక్కువగా ఉంది. సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్య, వైద్యానికి కేంద్రం తక్కువగా నిధులు విడుదల చేస్తోందన్నారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప ఉన్న సమయంలో మంజూరైన పనులు, పురోగతిపై సీపీఓ సాంబశివారెడ్డి చర్చించారు. నిబంధనల ప్రకారం మాజీ ఎంపీ రెడ్డెప్ప పాలనలో మంజూరైన పనులను నిబంధనల ప్రకారం రద్దు చేయకూడదని కలెక్టర్, సీపీఓ వెల్లడించారు. అయితే ప్రస్తుత ఎంపీ మాత్రం ఎందుకు రద్దు చేయకూడదని ప్రశ్నించారు. సీపీఓ శాఖలో చెప్పిన పనులు ఆలస్యంగా చేస్తున్నారని సీపీఓ సరిచేయాలని, లేకుంటే తాను సిట్‌రైట్ చేస్తానని ఎంపీ హెచ్చరించారు.

చర్చించింది 17 అంశాలే

ప్రతి శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజల సమస్యలను క్షుణ్ణంగా చర్చించాల్సిన ఈ సమావేశంలో 17 అంశాలను మాత్రం చర్చించి చేతులు దులుపుకున్నారు. అజెండాలో మాత్రం 31 అంశాలను చేర్చారు. అందులో 17 అంశాలను మాత్రం చర్చించి మమ అనిపించారు. ఎక్కువ సమయం అధికారులను నిందించడమే ఎమ్మెల్యేలు లక్ష్యంగా పెట్టుకున్నారు. టీచర్ల డిప్యూటేషన్ల విషయమై చెప్పిన మాట వినలేదని డీఈఓ దేవరాజును ఎక్కువ సమయం టార్గెట్ చేస్తూ ఎమ్మెల్యేలు మాట్లాడారు. డీఈఓను జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ చులకనగా మాట్లాడడం జిల్లా ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆసుపత్రులు దారుణంగా ఉన్నాయని, ఎలాంటి మౌళిక వసతులు లేవని డీఎంహెచ్ఓ ప్రభావతి దేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొగిలి ఘాట్ ప్రమాదాలు సంభవించినప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించే నేషనల్ హైవే అధికారులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అనుకున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ లో భాగంగా టిబి మిషన్, హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ మిషన్‌లకు కేంద్ర ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి 14, 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించాలని తెలిపారు.

విద్యార్థుల స్వచ్ఛతా హీ సేవ



భారత దేశ చిత్ర పటం ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యకరంగా ఉంటామని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచే పరిసరాల శుభ్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులచే, కేసీసీ సిబ్బంది, నేషనల్ హైవే అథారిటీ సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థులతో రూపొందించిన ఇండియా చిత్రపటం ఆకట్టుకుంది. నేషనల్ హైవే పీడీ కార్తీక రెడ్డి, బీఎం లోహిర్, సైట్ ఇంజనీర్ మణి ప్రసాద్, స్థానిక సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్, సీఐ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చోరుల అరెస్ట్


ముఠా వివరాలు తెలుపుతున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు: ద్విచక్ర వాహనాలు చోరీ చేసే అంతర్రాష్ట్ర ముఠాను పట్టుకు ని వారి నుంచి రూ.21 లక్షలు విలువ చేసే 23 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, పుంగనూరు, ముళబాగిల్, పలమనేరు, కర్ణాటక ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగలించి, ఇతరులకు విక్రయించే ముఠాపై సమాచారం అందిందన్నారు. చదళ్ల గ్రామంలో ఇంటిని అద్దెకు తీసుకుని అక్కడ 23 వాహనాలను దాచి ఉంచడాన్ని గుర్తించి పట్టుకున్నామన్నారు. దాడుల్లో కర్ణాటకకు చెందిన ముఠా నాయకుడు పరారీలో ఉన్నాడని, మిగిలిన నలుగురు హాసేన్, మహమ్మద్ వశీమ్, ముబారక్ బాషా, అతిక్‌ను పట్టుకుని వారి నుంచి 23 వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. వాహన యజమానులు సైతం గుర్తించే కార్యక్రమం చేపట్టామని సీఐ తెలిపారు. వాహన యజమానులు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే, వాహనాలకు జీపీఆర్ఎస్ పెట్టుకుంటే, దొంగలను పట్టుకోవడం సులభతరమవుతుందన్నారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ దామోదరం, పోలీసులు ప్రకాష్, రెడ్డెప్ప, నవీన్ పాల్గొన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ


ఈఈ శ్రీనివాసులు, శేషాద్రి, అశోక్ , ఆనంద్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రంలోని పలుశాఖల్లో శుక్రవారం అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఆర్అండ్‌బీ ఈఈగా శ్రీనివాసులుతోపాటు ముగ్గురు డీఈలు, ట్రాన్స్‌కో రూరల్–2 సబ్‌డివిజన్ ఈఈ శేషాద్రి, డివిజన్ కార్యాలయ వాణిజ్య విభాగం ఏఈగా శ్రీనివాసులు, నిర్మాణ విభాగం ఏఈగా రాజా, చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్‌గా అశోక్, చిత్తూరు రూరల్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఆనంద్ బాధ్యతలు చేపట్టారు. వీరిని ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులను ముంచే ముఠా

- ప్రోత్సాహకాల పేరుతో వసూళ్లు
- గ్రామాల్లో ముందుగా కరపత్రాల పంపిణీ
- వీరికి మద్దతుగా గ్రామాల్లో కొందరు ఏజెంట్ల నియామకం
- నమ్మి మోసపోవద్దంటున్న వ్యవసాయ అధికారులు



కీలపట్ల గ్రామంలో రైతులకు పంచిన కరపత్రాలు

పలమనేరు: మోసపోయే అమాయకులున్నంతవరకు మోసంచేసేవాళ్ళ పని చాలా సులవుగానే ఉంటుంది. ఇప్పటికే పలమనేరు ప్రాంతంలో ఎన్నో రకాల మోసాలు వెలుగు చూశాయి. ఇప్పుడు కొత్తగా రైతులను నట్టేట ముంచేందుకు ఓ ముఠా తయారైంది. తాము ఐక్యరాజ్య సమితి సౌజన్యంతో పనిచేస్తూ పర్యావరణాన్ని పెంపొందించేందుకు అటవీ వృక్షాలు, పండ్ల తోటలకు 30 ఏళ్ల పాటు ప్రోత్సాహాలు అందిస్తామంటూ నమ్మ బలుకుతోంది. అయితే రిజిస్ట్రేషన్ కోసం రైతులు రూ.1000 చెల్లించాలని వసూలు చేసుకెళ్తున్న విషయం శుక్రవారం గంగవరం మండలంలోని కీలపట్లలో వెలుగుచూసింది. వారు పంచిన కరపత్రాలను చూసిన సంబంధిత శాఖల అధికారులు ఇదంతా బోగస్ అని తేల్చడంతో అసలు విషయం బయటపడింది.

గ్రామాల్లో ఏజెంట్ల నియామకం

ఆయా గ్రామాల్లోకి వెళ్లినప్పుడు కాస్త అమాయకులుగా ఉండే వారిని ఏజెంట్లుగా నియమించుకుంటూ, వారికి విందులు ఏర్పాటు చేసి బుట్టలో వేసుకుంటున్నారు. వీరు స్థానికులు కాబట్టి వారు కట్టారు, వీరు కట్టారు మీరు కట్టండంటూ చెబుతున్నారు. దీంతో ఈ ముఠా వ్యాపారం బాగా సాగుతోందని సమాచారం. ఇప్పటికే పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో వీరి బృందాలు బాగా డబ్బు వసూలు చేసినట్టు తెలుస్తోంది.

ప్రభుత్వ పథకాల అమలు ఇలా

సాధారణంగా వ్యవసాయ, ఉద్యాన, అటవీశాఖలకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర పథకాలు ఆయా శాఖల ద్వారా మాత్రమే సాగుతున్నాయి. అలాంటిది ఓ ప్రైవేటు సంస్థ తాము ప్రోత్సాహాలను ఇస్తామంటూ చెబితే, రైతులు నమ్మకూడదని అధికారులు అంటున్నారు. ఈ విషయమై స్థానిక ఉద్యానశాఖ అధికారిని లక్ష్మీప్రసూనను వివరణ కోరగా ఇలాంటి స్వచ్ఛంద సంస్థల పేరిట రైతులను మోసం చేసేవాళ్లు వస్తుంటారని దీనిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు సంబంధిత శాఖల ద్వారానే అమలువుతాయని తెలిపారు. ఇలాంటి మోసం చేసేవాళ్లు ఎవరైనా గ్రామాల్లో కనిపిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. రైతులకు ఏదేనీ అనుమానాలుంటే సంబంధిత ఫారెస్ట్, అగ్రికల్చర్, హార్టికల్చర్ కార్యాలయాల్లోని అధికారులను సంప్రదించాలని తెలిపారు.

వీరి మోసాలిలా....

జేకేఎఫ్ ఆగ్రో ఫారెస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ పేరిట భద్రాచలం చిరునామాతో కరపత్రాలను ముద్రించారు. ఇందులో అటవీజాతి మొక్కలైన శ్రీగంధం, మహాగణి, టేకు, వేప, వెదురు, రోజ్‌ఉడ్ తదితర ఉద్యాన పంటలైన మామిడి, జామ, పనస, అల్లనేరేడు తదితర తోటలున్న రైతులను ప్రోత్సహించేందుకు తమ సంస్థ పనిచేస్తుందని అందులో ముద్రించారు. తమ వద్ద వెయ్యి రూపాయలు చెల్లించి, పేరు నమోదు చేసుకున్న రైతులకు ఏడాదికి రూ.5 వేల నుంచి రూ.10 వేల దాకా 30 ఏళ్లపాటు వారి ఖాతాల్లోకి ప్రోత్సాహక నగదును జమచేస్తామంటూ చెబుతున్నారు. దీన్ని నమ్మే రైతులను ఎంపిక చేసుకొని వారి నుంచి నమోదు రుసుంగా రూ.500, వెయ్యి ఇలా వసూలు చేసి వారికి ఓ రసీదునిచ్చి వెళుతున్నారు.

నన్ను మోసం చేశారు



నా మామిడి తోట పెద్దపంజాణి మండలంలో ఉంది. పది రోజుల క్రితం అక్కడ తోపు వద్ద నుంచి ఓ వ్యక్తి నాకు ఫోన్ చేసి అర్జెంట్‌గా తోటవద్దకు రావాలని చెప్పాడు. తాము మామిడికి ప్రోత్సహకాలను అందిస్తామని చెప్పారు. నిజమేనని వారివద్దకెళ్లి మాట్లాడా. నా తోట సర్వే నంబరు, మొత్తం మామిడి చెట్లు వివరాలడిగి రూ.1000 తీసుకున్నారు. మళ్లీ మీ వద్దకొస్తామని వెళ్లినోళ్లు ఇప్పటి వరకూ కనపడలేదు.

– సుబ్రమణ్యం నాయుడు, మామిడి రైతు, రామాపురం

అనుమానం వచ్చి డబ్బు కట్టలేదు



మా గ్రామంలో రెండ్రోజుల నుంచి మామిడి తోటలకు డబ్బులిస్తామంటూ కొందరు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటున్నారు. మా ఊరోళ్లు కొందరు డబ్బు కట్టారంట. కరపత్రం వచ్చి మా ఇంటికి ఇచ్చారు. దీన్ని నా భర్తకు చూపెడితే ఆయన అధికారులతో మాట్లాడారు. అధికారులు ఇది బోగస్ అని చెప్పారట. అందుకే డబ్బుకట్టలేదు. ఇలా రైతులను మోసం చేసేవారిపై చర్యలు తీసుకోవాలి.

– రెడ్డెమ్మ, కీలపట్ల, గంగవరం మండలం

శిలాఫలకాలపై అక్కసు


పెయింట్ వేసి కప్పేసిన శిలాఫలకాలు

విజయపురం: వైఎస్సార్ సీపీ పాలనలో వేసిన శిలాఫలకాలపై తమ అక్కసును టీడీపీ నేతలు ప్రదర్శిస్తూనే ఉన్నారు. మండలంలోని కళియంబాకం గ్రామంలో సచివాలయ, ఆర్బీకే భవనాల వద్ద ఉన్న శిలాఫలకంపై పెయింట్ వేసి మూసేశారు. ఈ సంఘటనపై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు సమాచారం అందించారు.

ఇరువర్గాల ఘర్షణ

తడ: పొలం విషయంలో ఇరు వర్గాల మధ్య నెలకొన్న వివాదం ఘర్షణకు దారితీసింది. ఎస్ఐ కొండపనాయుడు కథనం.. మండలంలోని పెరియవట్టు గ్రామానికి చెందిన సయ్యద్ ఇబ్రహీం కాలేషాకి అదే గ్రామంలో 15 ఎకరాల పొలం ఉంది. ఇటీవల చెన్నైకి చెందిన సయ్యద్ ఇబ్రహీం అనే వ్యక్తి ఆ పొలంపై తనకు హక్కు ఉన్నట్టు వాదనలకు దిగాడు. దీనిపై కోర్టుకు కూడా వెళ్లడంతో అక్కడ అతనికి ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం ఇరువర్గాలు తడ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోవడంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శరత్ ఆ భూమికి సంబంధించి అన్ని హక్కులు పెరియవట్టు ఇబ్రహీంకి ఉన్నట్టు తేల్చారు. ఈ క్రమంలో ఇరువర్గాలు కార్యాయం నుంచి బయటకు వచ్చేశాయి. ఇంతలో చెన్నైకి చెందిన ఇబ్రహీం కుటుంబ సభ్యులు పెరియవట్టుకు చెందిన ఇబ్రహీం కాలేషా, అతని తమ్ముడు నజీర్‌తోపాటు మరో మహిళపై దాడికి దిగారు. కారు అద్దాలు పగుల గొట్టారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పారిపోతున్న చెన్నై వాసులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బోయకొండ.. పుష్పశోభితం!


ముస్తాబైన బోయకొండ ఆలయం

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయానికి నూతన శోభ నెలకొంది. బెంగళూరు దేవనహళ్లి లక్ష్మీ ఫ్లవర్ డెకరేషన్స్ నిర్వాహకులు శుక్రవారం ప్రత్యేక పూలతో ఆలయాన్ని ముస్తాబుచేశారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని చెప్పారు. రంగురంగు పూలతోపాటు పూల సువాసనలతో ఆలయం భక్తులను ఆకట్టుకుంటోంది. 16 ఏళ్లుగా ఏటా క్రమం తప్పకుండా దసరా మహోత్సవాలకు ముందు వారం వీరు ఆలయాన్ని బెంగళూరు నుంచి పూలను తీసుకొచ్చి వారే స్వయంగా పూలతో ముస్తాబుచేసి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. ఆలయం లోపలే కాకుండా ఆలయం ముందు భాగం పరిసరాల్లో పూలతో అలంకరించడంతో నూతన శోభ నెలకొంది. వీరు ఆలయంలో నిర్వహించిన రాహుకాల అభిషేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వీరిని ఆలయ ఈఓ ఏకాంబరం సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.




పర్యాటక రంగం కీలకం


2 కే రన్‌లో గెలుపొందిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అతిథులు

చిత్తూరు కలెక్టరేట్ : పర్యాటకరంగం దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారిందని జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారి మల్లికార్జున అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి 2 కే రన్ నిర్వహించారు. అనంతరం మెసానికల్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో పర్యాటక స్థలాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. యువతలో పర్యాటక రంగం పట్ల అవగాహన పెంచడం వల్ల మరింత అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యువ పర్యాటక క్లబ్ కో–ఆర్డినేటర్ గోపినాయక్ మాట్లాడుతూ వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తే విభిన్న సంస్కృతులను, సంప్రదాయాలను తెలుసుకోవచ్చన్నారు. పర్యటక రంగం యువతకు కొత్త అవకాశాలను అందిస్తుందన్నారు. పర్యాటక రంగంలోకి యువత ఎక్కువగా రావాలని చెప్పారు. చిత్తూరు జిల్లాలో పర్యాటక ప్రాముఖ్యత పెంచడంలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. అనంతరం 2కే రన్ విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీవీకేఎన్ యువ పర్యాటక క్లబ్ ఉపాధ్యక్షులు రెడ్డి బాషా, అధ్యాపకులు చిట్టిబాబు, వెంకటేష్, శారద, గౌరీశంకర్ పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- సోమల మండల అధికారుల తీరు
- అధికార పార్టీకి తొత్తులుగా మారిన వైనం
- 16 మంది సంఘమిత్రల తొలగింపు



డీఆర్‌డీఏ పీడీకి కలెక్టర్ చేసిన సిఫార్సు

సాక్షి టాస్క్‌ఫోర్స్: అధికార పార్టీ ఆగడాలు, అరాచకాలు, అక్రమాలు రోజురోజుకూ మితిమీరుతున్నాయి. సాక్షాత్తు కలెక్టర్ ఆదేశించినా సోమల మండల అధికారులు ఖాతరు చేయలేదు. సోమల మండలంలో గత ఇరవై ఏళ్లుగా సంఘమిత్రలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ మహిళలు 16 మంది పనిచేస్తున్నారు. వీరిపై అధికార పార్టీ నాయకులు బెదిరింపులకు దిగారు. సంఘమిత్రలను తొలగిస్తామంటూ హెచ్చరించారు. కానీ నీతి నిజాయితీగా 20 ఏళ్లుగా పనిచేస్తున్న సంఘమిత్రలు తమను తొలగించవద్దంటూ అధికారుల వద్ద మహిళలు ప్రార్థించినా పట్టించుకోలేదు. అధికారులు 16 మంది సంఘమిత్రలను తొలగించి, నూతన సంఘమిత్రలను నియమించుకుంటూ అధికారులు, అధికార పార్టీ వారు కలసి ఎవరికి వారు సంతకాలు సేకరించుకున్నారు. దీనిపై ఈనెల 23న జిల్లా కలెక్టర్‌కు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో సంఘమిత్రలు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ డీఆర్‌డీఏ పీడీకి ఆదేశాలు ఇస్తూ వీటిని హోల్డ్‌లో పెట్టాలని ఆదేశాలిచ్చారు. అయినా ఖాతర్ చేయని మండల అధికారులు కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ 16 మందిని తొలగించేశారు. మహిళలు వెళ్లి ఏపీఎం శివకుమార్, సీసీలు గంగోజి, నరసింహులను అడిగితే టీడీపీ నాయకులను కలవడంటూ చెప్పడం గమనార్హం. దీనిపై కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని, నూతనంగా నియమించిన వారిని తొలగించి సంఘమిత్రలుగా ఉన్న వారినే కొనసాగించాలని కోరుతున్నారు.

మండల అధికారుల రూటే వేరు

సోమల మండలంలో గత మూడు నెలలుగా అధికారుల పనితీరుతో ప్రజలు విసిగిపోతున్నారు. ప్రతి చిన్న సమస్యను అధికారులే పెద్దది చేసి బెదిరించడంతో ప్రజలు మండిపడుతున్నారు. గత వారం సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె జగనన్న కాలనీకి, సచివాలయానికి రోడ్డు లేకుండా జేసీబీలతో ట్రెంచ్‌లు కొట్టారు. దీనిని పూడ్చి వేయాలని కలెక్టర్ ఈనెల 17న ఆదేశించినా తహసీల్దార్ ఖాతరు చేయలేదు. ప్రస్తుతం ఏపీఎం కలెక్టర్ ఆదేశాలు ఖాతర్ చేయడం లేదు. సోమల పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తూ, అమాయకులను బెదిరించడం, స్టేషన్‌లో కూర్చోపెట్టుకోవడంతో ప్రజలు హైకోర్టును ఆశ్రయించారు.

విద్యుత్ బస్సులు.. కూటమి బ్రేకులు

పర్యావరణ పరిరక్షణ.. ప్రయాణికుల సంరక్షణే లక్ష్యంగా గత ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందులో భాగంగా రెండేళ్ల క్రితం జిల్లాలో విద్యుత్ బస్సుల వినియోగానికి శ్రీకారం చుట్టింది. బస్సుల సంఖ్యను అంచెలంచెలుగా పెంచుతూ.. ఆదాయ మార్గాలను అన్వేషించింది. కానీ కూటమి సర్కార్ కొలువుదీరిన తర్వాత విద్యుత్ బస్సుల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. కొత్త సర్వీసులకు ప్రతిపాదనలు లేక.. కొత్త చార్జింగ్ పాయింట్లు చూపక అగచాట్లు పడాల్సి వస్తోంది. ఫలితంగా రాబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీనిపై సంబంధిత ఆర్టీసీ అధికారులు సైతం దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- 2022 సెప్టెంబర్27న ప్రారంభించిన అప్పటి సీఎం వైఎస్ జగన్
- పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా అడుగులు
- రెండేళ్లలో రూ.77.58 కోట్ల రాబడి
- గత నాలుగు నెలలుగా తగ్గుతున్న ఆదాయం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


అలిపిరి వద్ద విద్యుత్ బస్సులను ప్రారంభిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

2022 సెప్టెంబర్ 27 (50 సర్వీసులు) నుంచి 2023 మార్చి 31 వరకు	రూ.7.4 కోట్ల రాబడి
2023 ఏప్రిల్ 1 నుంచి (100 సర్వీసులు) 2024 మార్చి 31 వరకు	రూ.56.02 కోట్ల రాబడి
2024 ఏప్రిల్ 1 నుంచి(100 సర్వీసులు) 2024 సెప్టెంబర్ 27 వరకు	రూ.14.16 కోట్ల రాబడి

తిరుపతి అర్బన్: తిరుపతి–తిరుమల మార్గంలో పర్యావరణ పరిరక్షణతోపాటు భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ బస్సులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా 2022 సెప్టెంబర్ 27వ తేదీన అలిపిరి వద్ద వంద విద్యుత్ బస్సులను ప్రారంభించారు. ఇందులో 50 సర్వీసులను తిరుపతి నుంచి తిరుమలకు తిప్పుతున్నారు. మరో 14 సర్వీసులను రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి తిరుమలకు, ఇంకో 12 సర్వీసులను తిరుపతి నుంచి మదనపల్లికి, మరో 12 సర్వీసులను తిరుపతి నుంచి కడపకు, ఇంకా 12 సర్వీసులను తిరుపతి నుంచి నెల్లూరుకు ఏర్పాటు చేశారు. విద్యుత్ సర్వీసుల్లో సకల వసతులు ఉండడంతో ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. అలిపిరి డిపో ఆధారంగా మరో 250 విద్యుత్ సర్వీసులను ఏర్పాటు చేయాలని అప్పట్లోనే నిర్ణయించారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదనను పక్కన పెట్టేశారు. గత సర్కారు ఏర్పాటు చేసిన సర్వీసులనే ఉడతాభక్తిగా తిప్పుతున్నారు.

కొత్త సర్వీసుల ప్రతిపాదనలేవీ?

టీడీపీ కూటమి సర్కార్ ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా విద్యుత్ బస్సుల నిర్వహణ, ఆదాయ మార్గాల అన్వేషణపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొత్త సర్వీసుల ప్రతిపాదనలుగానీ, కొత్త విద్యుత్ సర్వీసులుగానీ ఏర్పాటు చేయకపోవడం ప్రయాణికులను బాధిస్తోంది.

తగ్గుతున్న రాబడి

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత విద్యుత్ సర్వీసుల నిర్వహణ గాలికొదిలేయడంతో రాబడి క్రమేణా తగ్గుతోంది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి విద్యుత్ సర్వీసుల రాబడి తగ్గిపోయింది. గత ఏడాది 12 నెలలకు రూ.56.02 కోట్ల రాబడి రాగా.. ఈ ఏడాది 6 నెలలకుగాను రూ.14.16 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే ఈ ఏడాది రూ.14 కోట్ల రాబడి తగ్గినట్టు ఆర్టీసీ అధికారులు చర్చించుకుంటున్నారు.

రెండేళ్లలో రూ.77.58 కోట్ల రాబడి

గత రెండేళ్లలో విద్యుత్ సర్వీసుల ద్వారా ఆర్టీసీకి రూ.77.58 కోట్లు సమకూరింది. తిరుమల ఘాట్ రోడ్డు రాబడిలో 59 శాతం విద్యుత్ సర్వీసుల యాజమానానికి, 41 శాతం ఆర్టీసీకి వర్తిస్తోంది. సాధారణ మార్గంలో 46 శాతం విద్యుత్ యాజమాన్యానికి, 54 శాతం ఆర్టీసికి రాబడి సమకూరుతోంది. గత ప్రభుత్వంలో విద్యుత్ బస్సులకు అలిపిరి డిపోలో 46 , తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో 11, తిరుపతి గ్యారేజీలో 4 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు.